జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 1-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 325 పేజీలు: 4 వెల: రూ.7



# త్వరలో పోలీసులకు బదిలీ

* కానిస్టేబుళ్లు, హెచ్‌సీలు, ఏఎస్‌ఐలకు స్థానచలనం * ఐదేళ్లు పూర్తయిన వారికే.. * ఎస్పీ ముందు జాబితా * చాలా ఏళ్లుగా పాతుకుపోయిన కొందరు సిబ్బంది * బదిలీ కాకుండా కొందరు ముమ్మర యత్నాలు * జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 30 (వార్త):** జిల్లా పోలీసు శాఖలో త్వరలో బదిలీ ప్రక్రియ ప్రారంభం కానుంది. రెండు మూడు నెలల కిందటే బదిలీ కావాల్సివుండేది. మరో వారం పది రోజుల్లో కానిస్టేబుళ్లు, హెచ్‌సీలు, ఏఎస్‌ఐల వరకూ బదిలీ అవుతారని విశ్వసనీయ సమాచారం. ఏప్రిల్ 30 నాటికి ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి బదిలీ అయ్యే అవకాశం ఎక్కువ. ఇప్పటికే ఎవరెవరు బదిలీ అవుతారన్న జాబితా ఎస్పీ వద్దకు చేరిందని తెలిసింది. ప్రస్తుతం విశాఖ, విజయనగరం జిల్లాల్లో బదిలీల ప్రక్రియ పూర్తయింది. త్వరలో శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్రక్రియ కొనసాగనుందని సమాచారం. పోలీసు శాఖలో కిందిస్థాయి ఉద్యోగుల బదిలీలకు ఉన్నతాధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ కూడా లభించింది. ఐదేళ్లపాటు ఒకేచోట పనిచేసిన వారిని కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీ చేయనున్నారు. కౌన్సెలింగ్‌లో వారు కోరుకున్న ప్రాంతాల్లో ఖాళీ ఉంటేనే బదిలీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్ నుంచి మరో సర్కిల్‌కు బదిలీ చేస్తారు. జిల్లాలో చాలావరకూ పోలీస్‌స్టేషన్లతో పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో గత కొన్నేళ్లుగా పలువురు పాతుకుపోయారు. వారు మరో స్టేషన్‌కు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. కొందరు పలు షాకులు, కారణాలు చెప్పి ఇక్కడే ఉండిపోయారు. చాలామంది పోలీసులు తమ పిల్లలను జిల్లా కేంద్రంలో చదివిస్తున్నారు. దీంతో వారు ఇక్కడి నుంచి కదిలేందుకు ఇష్టపడడం లేదు. జిల్లా పోలీసు కార్యాలయంలో తమకు తెలిసిన అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారు బదిలీ కాకుండా తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే యువ ఐపీఎస్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాత్రం జాబితాను పలుమార్లు పరిశీలించి బదిలీ చేసే అవకాశం ఉందని కొందరు కానిస్టేబుళ్లు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ మరికొద్ది రోజుల్లో పోలీసుల బదిలీ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## కోర్టు కానిస్టేబుల్.. సస్పెండ్

* పలు ఆరోపణలు నేపథ్యంలోనే వేటు * కేసు కూడా నమోదు

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 30 (వార్త):** కాశీబుగ్గలో ఓ కానిస్టేబుల్‌పై వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలకు సీఐ సూర్యనారాయణ మీడియాకు వివరించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా నారాయణ సుమారు ఎనిమిదేళ్లుగా పలాస కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. పలు కేసుల్లో రికవరీ చేసిన రూ.10 లక్షలు, 6.5 తులాల బంగారం కోర్టుకు అప్పగించకుండా సొంతానికి వాడుకున్నాడు. ఆయా కేసుల్లో రికవరీ సొత్తును తిరిగి రాబట్టుకోవడానికి గాను సంబంధిత బాధితులు కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సొత్తును అప్పగించాలని పలాస కోర్టు నుంచి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలోనే సొత్తును కోర్టుకు అప్పగిస్తానని తీసుకెళ్లిన కానిస్టేబుల్ నారాయణ ఇవ్వకపోవడంతో చివరకు దీనిపై దర్యాప్తు చేయాలని ఎస్పై చంద్రరావును అధికారులు ఆదేశించారు. దర్యాప్తులో నారాయణ సొత్తును కోర్టుకు అప్పగించలేదని నిర్ధారణ కావడంతో ఆయన్ను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారు. ఇంకా దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. కోర్టు కానిస్టేబుల్ నారాయణరావుపై మరిన్ని ఆరోపణలు ఉన్నాయి. బెయిల్ ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి ఎంతోకొంత తీసుకునేవాడని నిందితుల కుటుంబీకులు చెబుతున్నారు.




## క్రైం కార్నర్..

### వివాహిత బలవన్మరణం

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 30 (వార్త):** మద్యానికి బానిసైన భర్త కుటుంబ వ్యవహారాలను పట్టించుకోక పోవడం, నిత్యావసరాలకు ఉంచిన డబ్బులు ఖర్చు పెట్టేస్తుండటంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మేజర్ పంచాయతీకి చెందిన లక్ష్మి(36) అనే మహిళకు ఊడికలపాడుకు చెందిన పినిమింటి రామారావుతో 18 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి పదహారేళ్ల కుమార్తె జగదీశ్వరి, పద్నాలుగేళ్ల కుమారుడు శ్యామ్ ఉన్నారు. కొన్నాళ్లుగా భర్త మద్యానికి బానిసగా మారడంతో తరచూ తగాదాలు జరుగుతుండేవి. గతనెల 27న దాచిన డబ్బులు తీసేయడంతో భార్య ప్రశ్నించింది. గొడవతో మనస్తాపానికి గురై చీమల మందు తాగింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన కోటబొమ్మాళి తీసుకెళ్లారు. అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. తల్లి దేవాది నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

**పలాస, ఏప్రిల్ 30(వార్త):** జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో బుధవారం నలుగురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస మండలం చిన్ననీలావతి గ్రామం సమీపంలోని హైవేపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సొర్ర గణపతి, సొర్ర తంబయ్యలు గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరిని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. క్షత గాత్రులను హైవే అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సుభద్రాపురం సమీపంలో..

నందిగాం మండలం సుభద్రాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దుక్క కృష్ణారావుకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణారావు ఉపాధి పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి నందిగాం వచ్చే మార్గంలో నడుచుకుంటూ వస్తుండగా అదే మార్గంలో వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో కృష్ణారావు ఎడమకాలు విరిగిపోగా శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయ. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి హైవే అంబులెన్స్‌లో తరలించారు. నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొని..

నరసన్నపేట మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొని కొత్తపొలవలసకు చెందిన తలగాన గోవిందరావు తీవ్రంగా గాయపడినట్లు రైల్వే పోలీసు అధికారి మధుసూదనరావు తెలిపారు. బుధవారం ఉదయం పట్టాలు దాటుతున్న సమయంలో ఈప్రమాదం జరిగిందని, వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందన్నారు. ఈతడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు జీఆర్పీ హెచ్‌సీ తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


10th YEAR ANNIVERSARY
వివాహ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
10 వసంతాలు పూర్తిచేసుకుని,
11వ వసంతంలోకి అడుగుపెడుతున్న
శుభ సందర్భంగా మీ దంపతులకు
వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలుపుతూ...
కుమార్తె : బాడాన భాగ్యశ్రీ
కుమారుడు : పవన్ కళ్యాణ్
బాడాన మహేష్ - శ్రీమతి యమున
దంపతులు
జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
సిబ్బంది


దేశములో మహా రక్షణ కలుగజేయువాడు ఆయనే
కీర్తన 74:12
2025 మే
02
శుక్రవారం
సాయంత్రం 5.00 గం॥
అందరికి ఆహ్వానము
స్థలం :
N.T.R.M.H స్కూల్ గ్రౌండ్
7 రోడ్ జంక్షన్
శ్రీకాకుళం
వాక్యోపదేశకులు :
పాస్టర్ రాజా హెబెల్ గారు
రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ - హైదరాబాద్
SMUPF ప్రార్థన సహకారముతో
ఆశీర్వాద కూడిక
కుటుంబంగా రండి.. ఆశీర్వాదం పొందండి...
దైవసేవకులు, సువార్తికులు,
సంఘపెద్దలు సహకారముతో...
మరిన్ని వివరాల కొరకు : 9949246693, 9177752060
ప్రేమతో ఆహ్వానించువారు
వి .విజయ్ & బ్రదర్స్
తెలుగు బాప్టిస్టు చర్చి సంఘసభ్యుడు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జిమ్నాస్టిక్ కోచ్‌గా గిరిజన యువకుడు రామారావు



**మెళియాపుట్టి, ఏప్రిల్ 30 (వార్త):** మాతృదేశానికి సేవ చేయాలనే దృక్పథంతో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ విభాగంలో చేరి అంచెలంచెలుగా ఉద్యోగ విధి నిర్వహణలో భాగంగా ఈ ప్రాంతానికి చెందిన యువకుడు జిమ్నాస్టిక్ కోచ్‌గా సవర రామారావు బుధవారం నియమితులయ్యారు. అస్సాం బోర్డర్ సెక్యూరిటి ఫోర్స్‌లో స్పోర్ట్స్ విభాగంలో సుమారు పదేళ్ళ క్రితం ఉద్యోగం సంపాదించిన మెళియాపుట్టి మండలం బందపల్లి కాలనీ గ్రామానికి చెందిన సవర రామారావు అనే గిరిజన యువకుడిని జిమ్నాస్టిక్ విభాగంలో కోచ్‌గా నియమిస్తున్నట్టు బీఎస్ఎఫ్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

# ప్రోటోకాల్‌పై రచ్చరచ్చ

* వాయిదా పడిన మున్సిపల్ సమావేశం
* కమిషనర్ రామారావుపై చైర్మన్ గిరిబాబు ఆగ్రహం





**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. తొలుత జంటపట్టణాలకు ఉద్దానం ప్రాజెక్టు నుంచి తాగు నీరు అందించేందుకు జరుగుతున్న పనులపై సమావేశంలో చర్చ జరిగింది. అనంతరం తాగు నీటి బోర్లు వేసేందుకు కాంట్రాక్టు పొందిన బమ్మిడి రామకృష్ణ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో చర్చ సాగింది. అన్ని బోర్లు వేసేందుకు ఒక్కరే పనులు ఒప్పందానికి టెండర్లు వేయడం జరిగిందని, ఒప్పు కొన్న పనులు సకాలములో పనులు చేయడం లేదని సభ్యులు మండిపడ్డారు. అలాగే మున్సిపాలిటీలో బోర్లు తవ్వేందుకు కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి నిబంధనలు పాటించకుండా తనకు నచ్చిన విధంగా బోర్లు తవ్వుతున్నారని సభలో కొంతసేపు వివాదం జరిగింది. 350 నుంచి 400 అడుగుల లోతుకు తవ్వాల్సిన బోర్లు 100 నుంచి 200 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వుతూ మమా అనిపించేస్తున్నారంటూ కాంట్రాక్టర్‌పై కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, పప్పల ప్రసాద్ ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో 26 వ వార్డులో బోర్ వేసేందుకు తనను పిలవకుండా శంకుస్థాపన ఎలా చేశారని మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు కమిషనర్ ఎన్.రామారావుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కమిషనర్ ప్రోటోకాల్ పాటించకపోతే చైర్మన్ ఎందుకని సభను వాయిదా వేస్తున్నట్టుగా ప్రకటించారు. సభ్యులు వారించే ప్రయత్నం చేసే లోపే చైర్మన్ తన చాంబర్‌కు వెళ్లిపోయారు. చైర్మన్ బళ్ల గిరిబాబు తనపై ఆరోపణ చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మున్సిపల్ కమిషనర్ ఎన్. రామారావు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గుజ్జు జోగారావు, డిక్కల మన్మధరావు, ఆశాజ్యోతి, అధికారులు తదితరులు ఉన్నారు.

## కార్గో ఎయిర్‌పోర్టుకు.. బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

* ఈనెల 6న కళాజాతను జయప్రదం చేయండి
* వామపక్ష నేతలు




**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** కార్గో ఎయిర్‌పోర్టు కోసం బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు అన్నారు. పలాస సిఐటియు కార్యాలయం ఆవరణలో బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టొద్దని కోరుతూ పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు ఆధ్వర్యంలో మేదో మదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా జీవనం సాగిస్తున్న ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, శ్రీకాకుళం జిల్లాకు రక్షణ కవచంగా ఉన్న తీర ప్రాంతంలో లక్షలాది చెట్లు నరికి పర్యావరణానికి ముప్పు తేవడం జిల్లా అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర విమానాల శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని వారు ప్రశ్నించారు. ఇక్కడ ప్రజలు ఎవరు కార్గో ఎయిర్పోర్ట్ కోరడం లేదని, జిల్లాకు వంశధార రిజర్వాయర్ పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకి నీరు ఇవ్వాలని కోరారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబల్ ఇంజన్ సర్కారే అధికారంలో ఉందని నేరెడు బ్యారేజీ కోసం నోటిఫికేషన్ ఎందుకు వేయించడం లేదని కేంద్రమంత్రిని వారు ప్రశ్నించారు. ఎయిర్పోర్ట్ వస్తే ఉద్యోగాలు వస్తాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఇప్పటికే జిల్లాలో నిర్వాసితులైన ప్రజలకి ఎవరికైనా ఒక్క ఉద్యోగం అయిన మీరిచ్చారా అని ప్రశ్నించారు. బలవంత భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రసారం చేసి మే ఆరో తేదీన జరిగే కళా జాతరలో అత్యధికమంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్గో ఎయిర్ పోర్ట్ పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే మోహన్ రావు, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమ,సిపిఐ పలాస కార్యదర్శి చాపర వేణు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కోనేరు. రమేష్, సిఐటియు కార్యదర్శి ఎన్. గణపతి, జె. భాగ్యలక్ష్మి,పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, గుంటు లోకనాథం, నల్ల పరశురాం, పొట్టి యోగేష్, గుంట పాపారావు, మోహన్‌రావు, గుంట జోగిరాజు, శ్యాము, జోగి శ్రీదేవి, చెగుటి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత లేని మాంసం విక్రయిస్తే చర్యలు

* పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్
* 'జాతీయ వార్త'కు స్పందన



**పలాస, ఏప్రిల్ 30, (వార్త):** నాణ్యత లేని మాంసాన్ని విక్రయించినా, వ్యాధి బారిన మేకపోతుల మాంసాన్ని అమ్మకాలు చేసినా చర్యలు తప్పవని పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. 'ఒడిస్సా మేకపోతుల మాంసం పలాసలో విక్రయం' కథనానికి పశువైద్యాధికారులు స్పందించారు. బుధవారం మాంసం విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ వయసున్న మేకపోతుల మాంసంను విక్రయించడం తగదన్నారు. వ్యాధులకు గురైన మేకలను మాంసం కోసం వినియోగించడం నేరమన్నారు. మున్సిపల్ అధికారులకు రెండు కబేళా సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని చెప్పారు. కబేళా ఏర్పాటు చేస్తే మున్సిపల్ అధికారులు అనుమతి తీసుకుంటే మేము పరీక్షిస్తామని చెప్పారు. ప్రతి మాంసం విక్రయదారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండలన్నారు. ట్రేడ్ సర్టిఫికెట్‌తో పాటు ఎన్వోసీ కలిగి ఉండాలని చెప్పారు. ఇతరుల నుంచి ఎటువంటి అబ్జెక్షన్ ఉండదని అలాంటి సర్టిఫికెట్ కావాలని తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేష్, విక్రయదారులు రాజేష్, షేక్ అహ్మదుల్లా తదితరులు పాల్గొన్నారు.



## 25 మందికి సామూహిక ఉపనయనాలు

**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పూజారి వీధి ఉన్న రాధాకాంత ఆలయంలో 25మంది బ్రాహ్మణ వటువులకు చారి కర్మ పూజలు, యజ్ఞపవితధారణ చేసి ఆలయాలకు ఊరేగింపు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడియ బ్రాహ్మణులను సామాజికంగా ఉన్నతి చేయడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒడియ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ త్యాడీ, సభ్యులు బాబురావు పండా, నిత్యానంద పండా, సంతోష్ పండా, రాజేష్ పండా, ప్రదీప్ పాత్రో, పూజారి రవి, సంతోష్ పాల్గొన్నారు.

## రక్తదానంలో డీసీసీబీ ఉద్యోగులు




**శ్రీకాకుళం, ఏప్రిల్ 30 (వార్త):** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్ర సహకారంతో నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగులు, సహకార సంఘాల ఉద్యోగులు రక్తదానం చేశారు. పురుషులకు ధీటుగా మహిళలు ముందుకువచ్చి రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఇయర్ సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. వేసవిలో రక్త నిల్వలు తక్కువ ఉంటాయని, సామాజిక బాధ్యతతో ఆలోచించి రక్తదానం చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధికారులు, సిబ్బందితో పాటు రెడ్‌క్రాస్ జాతీయ యువజన అవార్డ్స్ గ్రహీత పెంకి చైతన్య, పీఆర్వో సత్యన్నారాయణ, శాశ్వత సభ్యులు బి. చిన్మయ రావు, ఎపిఆర్వో నంది ఉమా శంకర్, బి. జగదీశ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు




**శ్రీకాకుళం, ఏప్రిల్30 (వార్త):** కుల, వర్ణ, లింగ భేదాలను వ్యతిరేకించిన మహాత్మ బసవేశ్వర తత్వాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బసవన్న చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. బసవన్న 12వ శతాబ్దపు తత్వవేత్తగా సమానత్వాన్ని బోధించారని, అనుభవ మంటప స్థాపించారని జేసీ గుర్తుచేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వరరావు, టూరిజం అధికారి నారాయణరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఆమదాలవలస, ఏప్రిల్ 30(వార్త):** 2025 సంవత్సరానికి సంబంధించి సిద్ధార్థ పారిశ్రామిక సంస్థలో శిక్షణకు (ఐటిఐ) చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు శిక్షణ సంస్థ కరస్పాండెంట్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకునేందుకు మే నెల 24వ తేదీ వరకు సమయం ఉందని వెల్లడించారు. మే 26 న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత జూన్ 2 నుండి 10 వరకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయబడుతుందన్నారు. ఐటిఐకి దరఖాస్తు చేసుకునే పదో తరగతి ఆన్‌లైన్ మార్క్ షీట్, టిసి, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, అభ్యర్థి ఆధార్‌తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డు జెరాక్సులు, పాస్పోర్ట్ సైజు ఫోటోలు రెండు అభ్యర్థి ఈమెయిల్ ఐడి, ఫోన్ నెంబర్లుతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములు

**శ్రీకాకుళం టౌన్, ఏప్రిల్ 30 (వార్త):** శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక దినో త్సవం 'మే' డేని పురస్కరించుకొని కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తోందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం వారి అభ్యున్నతికి తప్పకుండా దోహదపడుతుందని స్పష్టం చేశారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల శ్రమ వల్లే సమస్త సంపదలు సమకూరుతాయన్నారు.



## రోడ్డుపై కూలిన భారీ వృక్షం

**మందస, ఏప్రిల్30 (వార్త):** ముకుందపురం గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు మంగళవారం అర్ధరాత్రి గాలి వానకు పడిపోయింది. దీంతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాలను కలిపే ఈ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్బి అధికారులు చెట్టు తొలగించి రాకపోకలకు అవకాశం కల్పించారు.

## చురుగ్గా జనసేన క్రియాశీలక సభ్యత్వాలు



**సరుబుజ్జిలి, ఏప్రిల్ 30 (వార్త):** సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీ మోహన్ జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షురాలు పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాల న్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఆమదాలవలస, ఏప్రిల్ 30 (వార్త):** రాగోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో తోటాడ, దూసి, అక్కివరం, వంజంగి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించటం, విద్యుత్ లైన్ల నిర్వహణ కొరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో తెలిపారు.


## కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



**మందస, ఏప్రిల్ 30 (వార్త):** మందస పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయ అధికారి జే.విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవుల్లో ఎండల్లో తిరగకుండా గ్రంథాలయంలో ఉన్న మంచి మంచిపుస్తకాల పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.

## టీడీపీ సంస్థాగత ఎన్నికలు

**మందస, ఏప్రిల్ 30(వార్త):** పొత్తంగి, సిరిపురం, బెల్లుపట్టియా గ్రామ పంచాయతీలలో టీడీపీ మందస మండల అధ్యక్షులు బావన దుర్యోధన అధ్యక్షతన పార్టీ సంస్థాగత ఎన్నికలు బుధవారం నిర్వహించారు. పొత్తంగి అధ్యక్ష కార్యదర్శులుగా కొర్రయి సూర్యనారాయణ, బుద్దెపు కృష్ణారావు, సిరిపురం అధ్యక్ష కార్యదర్శులుగా జగదీష్ పానీగ్రాహి, టెంక గణపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులతో మండల పార్టీ అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తమిరి భాస్కరరావు, దుంకూరు తిరుపతి, రట్టి లింగరాజు, తమ్మినేని ధనుంజయ, రాజాన మహేష్,మంగళ్ పాత్రో, బేసి ఈశ్వరరావు, ఆయా గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మూడు నెలలు వాటర్ ట్యాక్స్ రద్దు చేయండి

* బెల్లుపడా యజ్ఞానికి రూ75 వేల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు
* మూడు ఏసీలు కొనుగోలుకు 2.30 లక్షల రూపాయలా
* గర్ల్స్ హైస్కూల్ పక్కన నాలుగు షాపులు పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఆరు షాపులు వేలానికి కౌన్సిల్ ఆమోదం
* వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం






**ఇచ్ఛాపురం, ఏప్రిల్30 (వార్త):** మున్సి పాలిటీలో ఎన్నడూ లేని విధంగా నీటి కొరత ఎదు ర్కొంటున్నామని ఇంత తీవ్రస్థాయి నీటి సమస్య ఎప్పుడు చూడలేదని మున్సిపల్ కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు నీటి సమస్యపై కమిషనర్ రమేష్ ను నిలదీశారు. నెల రోజులుగా నీటి సమస్య పట్టిపీడిస్తుంటే ఏం చేస్తు న్నారంటూ కౌన్సిలర్ లునిలదీశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎమ్మెల్యే అశోక్లు సమీక్ష సమావేశం నిర్వహించినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు గట్టిగా ఎదిరించారు. మంత్రి సమావేశంలో ఒప్పుకున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తర్వాత మరమ్మతులకు గురైనట్లు చెప్పారని అందు వల్ల ఉద్దానం ప్రాజెక్టు నుండి నీరు ఇచ్చేందుకు అవ కాశం లేకపోయిందని కమీషనర్ చెప్పారు. మూడు నెలలు మున్సిపాలిటీలో వాటర్ ట్యాక్స్ రద్దు చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి సూచించారు. ఇప్పటికే అధికా రులతో చర్చించి ఆ దిశగా చర్యలు తీసుకొని ప్రకటన చేస్తామని చైర్పర్సన్ రాజ్యలక్ష్మి ప్రకటించారు. మున్సి పాలిటీలో నీటి కొరత వల్ల చాలా కుటుంబాలు మూడు నెలల పాటు వేరే గ్రామాలకు అద్దె ఇళ్లు తీసు కుని వలస పోతున్నారని ఇంత దౌర్భాగ్యస్థితి వస్తుం దని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నదిలో ఇసుక తవ్వడం వల్లే నీరు లేకుండా పోయిందని అధికారులు ఏం చేస్తున్నారని వైస్ చైర్ పర్సన్ ఉలాల భారతి దివ్య ప్రశ్నించగా ఇసుకను అడ్డుకోవడం తమ పని కాదని కమిషనర్ రమేష్ సమాధానం ఇచ్చారు. బెల్లుపడా తారకరామా యజ్ఞానికి మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి రూ.75 వేలు కేటాయించడంపై వైస్ చైర్ పర్సన్ ఉలాల భారతి దివ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక ప్రాంతానికి ఇలా నిధులు కేటాయిస్తే అన్ని ప్రాంతాల వారు వీధి ఉత్సవాలు కోసం అడుగు తారని అన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ పురుషోత్తపురం యజ్ఞానికి అదనపు సిబ్బందిని నియమించి ఇదే తరహాలో నిధులు కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీలో కౌన్సిల్ హాల్లో కాకుండా మూడు ఏసిలు కొనుగోలుకు 2.30 లక్షల రూపాయలు నిధులు కేటాయించడంపై వైస్ చైర్పర్సన్ భారతీ దివ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. గూగుల్ లో చెక్ చేస్తే ఏసీ ధరలు తెలుస్తాయని అధికారులను ప్రశ్నించారు. పాత పంచాయతీ ఆఫీస్ వద్ద ఉన్న ఆరు షాపులు మున్సిపల్ బాలికోన్నత పాఠశాల పక్కన ఉన్న నాలుగు షాపులు లీజు గడువు ముగియడంతో రిజర్వేషన్ ప్రాతిపదికల బహిరంగ వేలం వేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

## ఆదిత్యుని సన్నిధిలో..

# ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

**అరసవల్లి, ఏప్రిల్30 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామి దేవాలయానికి ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా బుధవారం విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ స్వాగతం పలికారు. స్వామి వారి పూజలు అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.



## మేజర్ జనరల్ జిల్లాలో పర్యటన

తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా బుధవారం కొత్తరోడ్డులో ఉన్న ఆర్మీ క్యాంటీన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సైనికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అలాగే సింహ ద్వారం దగ్గర ఉన్న ఎక్స్ సర్వీసు మెన్ కంట్రిబ్యూటరి హెల్త్ స్కీమ్ పోలిక్లినిక్ని సందర్శించారు. ఆయన వెంట తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామాంజలి మిశ్రా, కల్నల్ విక్రాంత్ పాండే, కల్నల్ ఆర్.ఎన్.ముతల్లిక్, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ రిటైర్డు గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వర రావు, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శైలజ, ఇ.సి.ఎచ్.ఎస్. శ్రీకాకుళం అధికారి రిటైర్డు లెఫ్టినెంట్ కల్నల్ బి.చంద్రశేఖర్, శ్రీకాకుళం క్యాంటీన్ మేనేజర్, రిటైర్డు సుబేధార్ మేజర్ పి.గోవిందరావు, విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసుమెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ప్రెసిడెంట్ పూర్ణ చంద్రరావు కటకం, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్య నారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామక్రిష్ణ, కోశాధికారి ఎం.సింహాచలం, హానరరీ ప్రెసిడెంట్లు బి.సంజీవరావు, తమ్మినేని కృష్ణారావు, తర్రా కృష్ణారావు, ఎస్.లక్ష్మణరావు, సభ్యులు ఎం.రాములు, కె.రాజేంద్ర ప్రసాద్, కె.రాజశేఖర్, బి.రాంబాబు, శ్రీనివాసరావు, ఎస్.అప్పలసూరి, ఎ.వి. జగన్మోహన్ రావు, స్టేట్ నార్తర్న్ జోన్ మహిళా సెక్రటరీ పి.పద్మావతి, డి.భారతి, పి.జమున, సేనా మెడల్ గ్రహీత జి.అమ్మన్నమ్మ, మాజీ సైనికులు పాల్గొన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక




## ధ్వజస్తంభం పున:ప్రతిష్ఠ

**శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 30(వార్త):** బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా మహా కుంభాభిషేకం తిరు మంజనం పూజలు నిర్వ హించారు. సహస్ర పంచ లోక పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో అర్చకులు దేవరకొండ శంకర్ నారాయణ శర్మ, ఆలయ ధర్మకర్త దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నక్క వీధిలో ఉన్న ఉమా జల్లేశ్వరాలయంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి 12వ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాలు, పండ్ల రసములతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా వీరభద్ర స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

# బంగారు కుటుంబాలకు బాసటగా నిలవండి

- **పీ4 సర్వే ద్వారా 75,566 కుటుంబాల గుర్తింపు**
- **కలెక్టర్ స్వప్నిల్ దింకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 30(వార్త):** పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 విధానాన్ని శ్రీకాకుళం జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దింకర్ పుండ్కర్ తెలిపారు. సమాజంలో ఆర్థికంగా అట్టడుగున ఉన్న 20 శాతం వెనుకబడిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, జిల్లాలో మొత్తం 75,566 కుటుంబాలు ఈ దిశగా ఎంపికయ్యాయని వెల్లడించారు. వీరిని సమాజంలో ఉన్నత స్థితికి చేర్చేందుకు 10 శాతం మంది "మార్గదర్శులు"గా ముందుకు వచ్చి, ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని వారికి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఇతర అవసరాల కోసం తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనుకునే వారు https://zeropover-typ4.ap.gov.in /Create Account.html వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం, దేశం నలుమూలలలో ఉన్న శ్రీకాకుళం వాసులు ముందుకు రావాలని ఆయన కోరారు.

# బీచ్ ఫెస్టివల్‌కు ఉత్సాహంగా ఏర్పాట్లు

- **బారువా బీచ్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్**

**సోంపేట, ఏప్రిల్ 30(వార్త):** జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బారువా బీచ్‌లో మే 3, 4 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ కోసం ఏర్పాట్లు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బీచ్ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఆయన వెంట పలాస ఆర్డీఓ వెంకటేష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్ ఉన్నారు. ఈ సందర్బంగా జేసి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుద్దీపాల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల నిర్వహణ, పిల్లల ఆటల కోసం క్యామెల్, హార్స్ రైడింగ్, నది బోటింగ్, శాశ్వత హట్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలాస డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, పలాస మున్సిపల్ సిబ్బంది, ఉద్యానవన శాఖ, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## 'ఇతరులపై ఆరోపణలు చేయడం బాబుకు పరిపాటి'

**శ్రీకాకుళం టౌన్, ఏప్రిల్ 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన పూర్తిగా తప్పుడు ప్రచారాల మీదే ఆధారపడిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఒక ప్రకటనలో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తేలికపాటి మాటలతో తక్కువ చేయాలని చూసిన చంద్రబాబు, నిజాలను పూర్తిగా మర్చిపోయారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మత్స్యకారుల సంక్షేమం కోసం ఎన్నో అప్రతిహ పథకాలు తీసుకువచ్చిన వాస్తవాన్ని ఆయన గానీ, ఆ పార్టీ నాయకులుగానీ గుర్తించలేదని దుయ్యబట్టారు. భావనపాడు పోర్ట్ విషయంలో కూడా చంద్రబాబు చేస్తున్న ప్రచారం అర్థరహితం. పోర్ట్‌కు భూముల సేకరణ, పునరావాస పనులు, మూల సదుపాయాల అభివృద్ధి అన్నీ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ, మత్స్య కార భరోసా, బీమా ఇతర అభివృద్ధి సహా అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చింది జగన్మోహన్ రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వమే అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేయటానికి ముందు, తమ 14 ఏళ్ల పాలనలో ప్రజల కోసం ఏమి చేసారో చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సన్మానం

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్30 (వార్త):** ఉద్యోగ విరమణ పొందిన అనంతరం సంతోషంగా శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పి కె.వి. మహేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందుతున్న వి.దేవదానం (ఎస్సై ట్రాఫిక్), పి.కోటేశ్వరరావు(ఆఫీస్ సూపరింటెండెంట్), ఎన్.అప్పల నాయుడు (ఏఎస్సై వజ్రపుకొత్తూరు), ఎన్.చిన్నబాబు (ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్)లకు జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలు చాల గొప్పవని, విధి నిర్వహణలో అందించిన సేవలే ప్రతి ఉద్యోగికి గుర్తింపు తెస్తాయని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవితాన్ని గడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయ ఏ.ఓ సి.హెచ్.గోపినాథ్, ఆర్మ్డ్ రిజర్వ్ ఆర్ఐ కె.నర్సింగరావు, కార్యాలయ సూపరింటెండెంట్లు బాలరాజు, లిల్లి బాయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.












## నేత్రపర్వం.. లక్ష్మీనరసింహస్వామి నిజరూప దర్శనం

**ఆమదాలవలస,ఏప్రిల్ 30(వార్త):** మండలంలోని సైలాడ పంచాయతీ పరిధి దివంజిపేట గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి నిజ రూపంలో భక్తులకు బుధవారం అద్భుతంగా దర్శనమిచ్చారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని స్వామివారి చందనం తొలగించి నిజ రూప దర్శనం భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి క్షీరాభిషేకం పంచామృతాభిషేకాలు, నారికేళ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిజరూపు దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం ప్రాచీన మైనది కావటంతో స్వామి వారి ఆలయం ముందు చారిత్రకమైన బావి ఉండడం, అందులో చూస్తే స్వామివారి పాదాలు కనిపిస్తాయని భక్తులు విశ్వసిస్తుండడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. స్వామి వారికి చందనం అద్దేందుకు భక్తు సేకరించి తయారుచేసిన చందనాన్ని అలంకరించేందుకు పోటీ పడ్డారు. అర్చకులు మురపాక ప్రకాష్ శర్మ, రాహుల్ శర్మ, నవీన్ శర్మలు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన చింతాడ



**ఆమదాలవలస, ఏప్రిల్ 30 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ వద్ద జిల్లా అధికార ప్రతినిధులకు, నియోజకవర్గ సమన్వయకర్తలకు, జిల్లా అధ్యక్షులకు వర్క్ షాప్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి జగన్ మోహన్ రెడ్డిని కలిసారు. ప్రస్తుతం ఉన్న ఆమదాలవలస నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భం గా జిల్లా రాజకీయాలతో పాటు నియోజకవర్గ మాజీ సీఎం ఆరో తీసినట్టు తెలుస్తుంది. జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో బొడ్డేపల్లి రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఎం.పీ నిధులతో కళాక్షేత్రం

**రాజాం, ఏప్రిల్ 30(వార్త):** స్థానిక బొబ్బిలి రోడ్డు లో సుమారు 20 లక్షల వ్యయంతో నిర్మించిన జీఎంఆర్ వరలక్ష్మి కళాక్షేత్రాన్ని మాజీ ఎంపీ చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కళాకారుల భవనం నిర్మాణం కోసం ఉచితంగా స్థలంలో కేటాయించారు. అయితే ప్రముఖ రంగస్థల నటుడు, పద్మశ్రీ ఆవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు సూచనలు మేరకు, ఎంపీ నిధులుకై గతంలో వైసిపి హయాంలో బెల్లాన చంద్రశేఖర్‌ను కలిశారు. భవనం నిర్మాణానికి ఆయన ఎంపి నిధులు నుండి రూ. 9.95 లక్షలు కేటాయించారు. ఆ విధులకు అదనంగా గోపాలరావు తన సొంత నిధులు రూ. 9.55 లక్షలు వెచ్చించారు. రూ.20 లక్షలతో భవనం నిర్మించారు. బుధవారం ప్రారంభోత్సవానికి ఎంపీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు, అనంతరం కళాకారులు ప్రత్యేక పూజలు చేసారు. కార్యక్రమానికి పట్టణ పార్టీ అధ్యక్షులు, పాలవలస శ్రీనివాసరావు, కళాకారులు ఆర్నిపల్లి వెంకటనాయుడు మాస్టర్, అనకపు కృష్ణమూర్తి, తదితర కళాకారు బృందం పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546